క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తెలంగాణ సార్వత్రిక విద్యా విధానం (ఓపెన్ స్కూల్) ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ చదివేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు హైస్కూల్ కోఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన వారు మళ్లీ చదువుకునే అవకాశం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ కల్పిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వివరాలకు 9502629607 నంబరులో సంప్రదించాలని కోరారు.

సంఘటిత పోరాటం తప్పదు

ఇల్లెందు: భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధన కోసం కార్మికులు, సంఘాలు సంఘటితంగా పోరాడాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఇల్లెందులో ఇఫ్టూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ఇల్లెందులో జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ... ప్రమాదకర పరిస్థితుల మధ్య బహుళ అంతస్తుల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. దేశంలో 44 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికులు పని చేస్తున్నారని, కార్మిక చట్టాలను కాలరాస్తూ 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా తెచ్చిన కేంద్ర ప్రభుత్వం తీరును తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంసింగ్, భాస్కర్‌రెడ్డి, రామచంద్రు, సురేష్, రంగబాబు, పోలూరి శ్రీనివాస్, శివ, సట్ల యాకయ్య, కుమారి, చంటి, బలరాం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు



కొమరారం పోలీసుస్టేషన్ వద్ద నాయకులు

ఇల్లెందురూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం, ఇల్లెందు పర్యటన నేపథ్యంలో మండలంలోని సేవాలాల్ సేన నేతలను కొమరారం పోలీసులు ఆదివారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన మండల శాఖ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని న్యాయ పోరాటం చేస్తున్న సేవాలాల్ సేన ప్రతినిధులను అరెస్టు చేయడం రాజకీయంగా బంజారాలను అణచివేయడమేనని ఆరోపించారు. ఎన్ని నిర్బంధాలు విధించినా రాష్ట్రంలో బంజారాలకు మంత్రి పదవి ఇచ్చేవరకు తమ ఉద్యమం కొనసాగుతుందన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ప్రాంతమైన రామవరంలోని మాదిగ సంక్షేమ సంఘం (అంబేద్కర్ భవన్) మాజీ ఉప ప్రధానమంత్రి బాబూజగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి నిర్వహించారు. నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదిగ సంక్షేమ సంఘం నాయకులు భూపేష్, వెంకన్న, సామర్ల సమ్మయ్య, తిప్పారపు ఎల్లయ్య, మద్దికుంట గణేష్, మధు, వెంకట్రావ్, పోచయ్య పాల్గొన్నారు.

కార్మికులకు బోనస్ జమ

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు ఎల్ఎస్ఎన్ కంపెనీలో పని చేస్తున్న 49 మంది బ్లాస్టింగ్, ఓబీ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున ఇవ్వాల్సిన బోనస్ డబ్బులను ఆదివారం వారి ఖాతాల్లో కంపెనీ యాజమాన్యం జమ చేసింది. ఈ మేరకు ఆదివారం ఇఫ్టూ నాయకుడు దుబాకుల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏకాదశి ప్రత్యేక పూజలు

కొత్తగూడెంటౌన్: తొలి ఏకాదశి పండుగను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసంలో వచ్చే తొలి తెలుగు పండుగ కావడంతో ప్రజలు భక్తిశ్రద్ధలతో శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఆలయాల్లో, ఇళ్లల్లో పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాలకు భక్తులు తరలిరావడంతో రద్దీ నెలకొంది..

ఇల్లెందురూరల్: పలు ఆలయాల్లో ఆదివారం ఏకాదశి సందడి నెలకొంది. గ్రామాలలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ఉపవాస దీక్ష ఆచరించి రోజంతా ఆలయాల్లోనే గడిపారు. సాయంత్రం ఆలయాల్లో ఇష్టదైవాన్ని స్మరిస్తూ భజన కార్యక్రమాలు నిర్వహించారు.



జూలూరుపాడు: కాకర్ల శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో...



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ రామాలయంలో పూజ చేస్తున్న భక్తులు

జూలూరుపాడు: ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాలకు పేలాల పిండిని దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయాల్లో పూజారులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



పాల్వంచ: పీర్ల పండుగలో పాల్గొన్న కొత్వాల



టేకులపల్లిలో పీరీల ముగింపు వేడుక

కొత్తగూడెంటౌన్: మొహర్రం పండుగను పురస్కరించుకుని ఆదివారం ఆహ్‌లే సున్నత్‌వాల్ జమాత్ ఆధ్వర్యంలో షర్బత్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ కరీంఖాద్రీ మాట్లాడుతూ... మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌తో పాటు 72 మంది వీర మరణం పొందిన రోజును త్యాగాలకు గుర్తుగా మొహర్రం జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ గౌసుద్దీన్, షేక్ యాకుబ్ ఖాద్రీ, సయ్యద్ యాకుబ్‌ద్దీన్, హుస్సేన్‌ఖాన్, షమీ, షఫీ, సలీం, నయిమ్‌చిష్తి, మదీనా, అక్తర్ పాల్గొన్నారు.

పాల్వంచ: కుల, మతాలకు అతీతంగా, త్యాగానికీ ప్రతీకగా జరుపుకునే పండుగ మొహర్రం అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక పాత పాల్వంచలోని పీర్ల కొట్టం వద్ద జరిగిన మొహర్రం వేడుకలో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కే.ఇమామ్, ఎస్‌కే.ఉబేద్, ఎస్‌డీ.కరీముల్లా, ఎస్‌కె.నిజాముద్దీన్, ఎస్‌కె.అజ్మత్ అలీ, యాకూబ్ అలీ, గుమ్ము, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలోని బోడు, మూడుతండా తదితర ప్రాంతాల్లోని పీర్ల చావడి వద్ద ఏర్పాటు చేసిన పీరీల వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిసాయి. పీరీలను సర్వాంగ సుందరంగా అలంకరించి వాటిని ఎత్తుకుని ఆట పాటలతో ఊరేగింపు నిర్వహించారు. వాగు సమీపంలో పీరీలను నిమజ్జనం చేశారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీగా సుందర్‌పాల్



టేకులపల్లి: అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా రెండో మహాసభ జూలూరుపాడు మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ మహాసభలో సులానగర్ గ్రామానికి చెందిన కర్లపూడి సుందర్‌పాల్‌ను జిల్లా జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంకితభావంతో పనిచేయాలి



శ్రీకాంత్ దంపతులను సన్మానిస్తున్న జీఎం, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ రంగ సంస్థల్లో పదోన్నతులు, ఉద్యోగ విరమణ అనివార్యమని సింగరేణి కార్పొరేట్ ఐఈడీ జీఎం బొజ్జా రవి అన్నారు. సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ సెక్షన్‌లో ఏజీఎంగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన గోనె శ్రీకాంత్ దంపతులను ఘనంగా సన్మానించారు. జీఎం మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అంకితభావంతో చేయడం మూలంగా ఈ స్థాయికి చేరుకున్నారని, ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ జీఎం ప్రసాద్‌రావు, సింగరేణి ఆస్పత్రి సీఎంఓ డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్, వర్క్‌షాపు జీఎం దామోదర్, డీవైజీఎం రాజీవ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: జూలూరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ వినోభానగర్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినోభానగర్ గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

13న యాదగిరిగుట్టకు ప్రత్యేక బస్సు

ఇల్లెందు: ఈ నెల 13న ఇల్లెందు నుంచి భక్తులను యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దర్శనం కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్‌టీసీ ఖమ్మం ఆర్‌ఎం సరిరాం ఆదివార ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ ఆదివారం ఉదయం 5 గంటలకు ఇల్లెందు బస్‌స్టేషన్ నుంచి డీలక్స్ బస్సు బయలు దేరుతుందని తెలిపారు. యాదగిరి గుట్టతో పాటు స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని రాత్రి 10 గంటలకు ఇల్లెందుకు చేరుకుంటుందని తెలిపారు. బస్సు చార్జీ పెద్దలకు రూ.840, పిల్లలకు రూ.440, ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం టీజీఎస్‌ఆర్‌టీసీబస్.ఇన్ - సర్వీస్ నంబర్ 8444లో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9866159829, 9346728893, 9136446666 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పది గంటల పని ఉత్తర్వులను రద్దు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: కార్మిక శాఖ పర్యవేక్షణలో ఉండే సంస్థల్లో పని చేసే కార్మికుల పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచే విధంగా జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రమ శక్తితోటి కార్పొరేట్లకు అధిక లాభాలను కట్టబెట్టాలనే ఉద్దేశంతో ఒకపక్క మోదీ సర్కార్ నాలుగు లేబర్ కోడ్లను తెస్తున్న నేపథ్యంలో దీన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 9న యావత్ కార్మిక లోకం సమ్మెకు సిద్ధమవుతుంటే, మరోపక్క రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మోదీ అడుగుజాడల్లో నడుస్తూ శనివారం కార్మిక శాఖ తీసుకొచ్చిన జీఓతో పది గంటలు పెంచడం దారుణమన్నారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేకత విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న జరగనున్న సమ్మెలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం అయిన ఐఎన్‌టీయూసీ సైతం పాల్గొంటుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరించి పది గంటలు పెంచడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులకు అండగా ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 282 తక్షణమే రద్దు చేయాలని పేర్కొన్నారు.

బంజారాల హక్కుల కోసం కొట్లాడుదాం..



మాట్లాడుతున్న సంజీవ్ నాయక్



హాజరైన నాయకులు, అభిమానులు

పాల్వంచ: బంజారాలు మంత్రి పదవుల కోసం చేతులు చాచాల్సిన అవసరం లేదని, హక్కుల కోసం కొట్లాడి సాధించుకోవాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఏక పక్షంగా బంజారాలు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలుపించుకున్నట్లు చెప్పారు. కానీ ఈ ప్రభుత్వం మంత్రి పదవులను ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. గోర్ బోలిని ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా సేవాలాల్ సేన కమిటీ నిర్ణయం మేరకు పోరాటాలు నిర్వహించాలని, సంజీవ్ నాయక్ ఆలోచనలు, సంఘ నిర్మాణానికి, కట్టుబాట్లకు అనుగుణంగా హక్కుల కోసం పోట్లాడాలన్నారు. కార్యక్రమంలో రమేష్ రాథోడ్, బానోతు కిషన్, గుగులోతు దేవీలాల్, భూక్యా బాబులాల్, సపావట్ బాలకృష్ణ, సైదా, స్వరాజ్, కిషన్, బాబులాల్, మోహన్, రామారావు, భాస్కర్, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు నాయక్, కాన్షీరాం తదితరులు పాల్గొన్నారు.

‘ఈజీ ఆఫ్ డూయింగ్’ను వ్యతిరేకించండి..

సింగరేణి(కొత్తగూడెం): ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పనిగంటల జీఓ ప్రతులను సోమవారం దహనం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం మంచికంటి భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారానికి 48 గంటలు, వాణిజ్య సముదాయాల్లో రోజుకు 10 గంటలు పనిదినాన్ని అమలు జరిపే విధంగా జీఓ నంబర్ 282ను జారీ చేయటాన్ని సీఐటీయూ వ్యతిరేకిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను అమలుకు ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే కొత్త పాలసీని సృష్టించిందని, ఆ విధానంలో పని గంటలు పెంచడం, వేతనాల్లో కోతపెట్టటం, కార్మికుల సంక్షేమ సౌకర్యాలను కుదించటం, పనిభారాన్ని పెంచటం తదితర నిర్ణయాలు చేస్తున్నారని వాటి అమల్లో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ నిర్ణయం తీసుకుంటోందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను అమలు చేసే ప్రక్రియలో బీజేపీ విధానాన్ని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందని జీఓ 282 జారీ చేయటం ద్వారా స్పష్టమవుతోందన్నారు.



మాట్లాడుతున్న మధు

సమ్మేళనాలు సమాజ హితం కావాలి

ఇల్లెందురూరల్: సమ్మేళనాలతో చర్చలు, ఆలోచనలు, అనుబంధాలు పెంపొందుతాయని, ఆ ఆలోచనలన్నీ సమాజాభివృద్ధికి, విద్యాప్రగతికి తోడ్పాటు నందించాలని ఎంఈఓ ఉమాశంకర్ అన్నారు. సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో 2012-13లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులు పాఠశాలలో చిన్ననాటి జ్ఞాపకాలను మననం చేసుకుంటూ ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి గురువులు పిల్లి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, పూర్వ విద్యార్థులు అశోక్, తరుణ్, ప్రశాంత్, సాగర్, సంధ్య, భవానీ, అనూష, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



2012-13 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులు



కొత్తగూడెంఅర్బన్: శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



పాల్వంచరూరల్: మొక్క నాటుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

చుంచుపల్లి/పాల్వంచరూరల్: బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జనసంఘ్ నేత డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కూలీలైన్ 153-148 బూత్‌లో, పాల్వంచలోని వికలాంగుల కాలనీలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళర్పించారు. మాట్లాడుతూ.. 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించాడన్నారు. హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ, జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించినట్లు చెప్పారు. అనంతరం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శీలం విద్యాసాగర్, యమునోరి శివకృష్ణ, మాడ కృష్ణారెడ్డి, జలరాపు శ్రీనివాస్, విజయ, ఆకుల కృష్ణ, శంకర్, రాజు, రాపాక రమేష్, చింతల చెరువు శ్రీనివాసరావు, వంశీ, నర్సుదాస్, కళ్యాణ్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, సీతారాంనాయక్, యడ్లపల్లి శ్రీనివాస్, బుడగం రవికుమార్, దున్నపోతుల రాజు, వెంకట్‌నాయక్, గిరిగౌడ్ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలం బీజేపీ నాయకులు ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్, ప్రధాన కార్యదర్శి రెడ్డెం నవీన్ కుమార్, ధనలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

గని ప్రమాద మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న జీఎం కృష్ణయ్య, అధికారులు

ఇల్లెందు: 1938లో మొహర్రం పండుగ రోజున 24 ఏరియాలోని స్టట్ ఇంక్లైన్ గనిలో ప్రమాదవశాత్తు సింగరేణి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు మృతి చెందారు. ఈ మేరకు మృతుల స్మారకార్థం నిర్మించిన సమాధుల వద్ద ఆదివారం ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్యతో పాటు ఇతర విభాగాల అధికారులు, పాసీ కులస్తులు నివాళులర్పించారు. జీఎం మాట్లాడుతూ... ఆ ప్రమాదంలో 43 మంది మృతి చెందారని, దీంతనో సింగరేణిలో భూగర్భ గనులలో పని చేసేందుకు ఎవరూ రాకపోవడంతో ఉత్తరప్రదేశ్‌లోని పాసీ కులస్తులను తీసుకొచ్చి బొగ్గు వెలికి తీశారని తెలిపారు. ప్రతీ ఏటా మొహర్రం నాడు గనిప్రదేశంలో సంస్మరణ సభ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించడం అనవాయితీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(ఐడీ) గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారం, డీజీఎం(సివిల్) రవికుమార్, ఇతర అధికారులు రాందాస్, ధనుంజయ్‌రెడ్డి, నాగరాజు నాయక్, అంజిరెడ్డి, శివకుమార్, సతీష్, అజయ్, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఇతర తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డుగూడెం రోడ్డు అధ్వానం

- దారి పొడవునా గతుకులు
- రోడ్డు పక్కన మిషన్ భగీరథ గుంతలు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ డివిజన్ పరిధిలో అంతర్గత రోడ్లు గతుకులమయంగా మారాయి. నాసిరకం నిర్మాణాల వలన వేసిన మూడు, నాలుగేళ్లకే దెబ్బతింటుండటంతో గుంతలు పడుతున్నాయి. ఒడ్డుగూడెం రోడ్డు గుండా వెళ్లాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పొడవునా పైపులైన్ల లీకేజీలే. నిత్యం పైపులైన్ల లీకేజీల నుంచి భారీ ఎత్తున తాగునీరు వృథా అవుతున్నాయి. అంతేగాక మిషన్ భగీరథ పైపులైన్ల కోసం పలుచోట్ల రోడ్ల పక్కన జేసీబీలతో గుంతలు తీస్తున్నారు. వెంటనే పైపులైన్లు వేసి పూడ్చేయాల్సి ఉండగా రోజుల తరబడి ఉంచుతుండటంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.

పైపులైన్ల లీకేజీలతో దెబ్బతిన్న రోడ్డు...

కేఎస్‌పీ రోడ్డు నుంచి బీసీఎం హైవే రోడ్డు వరకు సుమారు కిలోమీటరు మేర ఈ ఒడ్డుగూడెం రోడ్డు ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఈ రోడ్డులో రద్దీ పెరిగింది. పాఠశాలలు, కళాశాలలు సైతం ఈ మార్గంలోనే ఉన్నాయి. కాగా రహదారి నుంచి కిన్నెరసాని వెళ్లే వాహనదారులు సైతం షార్ట్‌కట్‌లో ఈ రోడ్డు నుంచే వెళ్తుంటారు. ఇటీవల కాలంలో రోడ్డు పక్కనున్న పైపులైన్లకు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డుపై నీళ్లు వాగులా పారుతుండటంతో సీసీ రోడ్డు భారీ ఎత్తున దెబ్బతింది. నాణ్యత లేకుండా రోడ్డు వేయడంతో లీకేజీ నీళ్ల కారణంగా రోడ్డు పొడవునా గుంతలు పడ్డాయి. వచ్చిపోయే వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీళ్లు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

గుంతలు తీసి వదిలేస్తున్నారు... ఇటీవల కాలంలో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇంటింటికీ ఇస్తున్న క్రమంలో పైపులైన్ల ఏర్పాటు కోసం గుంతలు తీస్తున్నారు. అంతేగాక లీకేజీ పైపులైన్ల మరమ్మతుల కోసం సైతం గుంతలు తీస్తున్నారు. అయితే ఈ పనులు వెంటనే కాకుండా నెలల తరబడి తాత్సరం చేస్తున్నారు. రోడ్డు పక్కన గుంతలు అనేక చోట్ల ప్రమాదాలకు నెలవుగా మారడమేగాక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేపట్టిన వెంటనే యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు దెబ్బతినడంతో నిలిచిన వర్షం నీళ్లు



ప్రమాదకరంగా మిషన్ భగీరథ గుంతలు

గుంతలమయం..



ఒడ్డుగూడెం రోడ్డులో పైపులైన్ల లీకేజీలు అధికంగా ఉన్నాయి. నీళ్లు వదిలినప్పుడు లీకేజీ నీళ్లు భారీ ఎత్తున రోడ్డుపైనే పారుతున్నాయి. ఈ నీళ్లు ఇలా పారుతుండటంతో సీసీ రోడ్డు సైతం భారీగా దెబ్బతింది. గుంతలు పడి ప్రమాదకరంగా మారింది.

– బడేమియా, పాల్వంచ

పనుల్లో తీవ్ర అలసత్వం...



మిషన్ భగీరథ కనెక్షన్లు ఇంటింటికీ ఇస్తున్నారు. అయితే ఇందు కోసం తీసిన గుంతలను వెంటనే పూడ్చడం లేదు. రోజుల తరబడి ఉంచడంతో ప్రమాదకరంగా మారాయి. పైపులైన్ల లీకేజీల పేరుతో తీసిన గుంతలు కూడా పూడ్చటం లేదు.

– కల్యాణ్, పాల్వంచ

పలువురిని పరామర్శించిన మంత్రి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో కలిసి అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దెల శివకుమార్, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. గిడ్ల పరంజ్యోతిరావు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం..

పాల్వంచరూరల్: ఎస్ లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలో నివాసం ఉంటున్న నిరుపేద వికలాంగుడైన బొల్లి రాము స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్నాడు. సొంత జాగాలో ఇల్లు కట్టుకోవాలని ఏళ్లుగా కలలు కంటున్నాడు. సాధ్యం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటి పథకంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆదివారం మంత్రి పొంగులేటి పర్యటన కార్యక్రమంలో అధికారులు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తూ రాముకు ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి ఇంటి మంజూరు పత్రాన్ని అందజేశారు.

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సులానగర్ గ్రామంలో పర్యటించారు. టేకులపల్లి మాజీ వైస్ ఎంపీపీ ఉండేటిప్రసాద్, సులానగర్ మాజీ సర్పంచ్ అజ్మీరా బుజ్జి శివ కుమారుడు అజ్మీరా అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి ఆదివారం మృతుల నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పాల్వంచ: ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు పైడిపల్లి మనోహర్‌రావు కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి పరామర్శించారు. ఆదివారం గట్టాయిగూడెంలోని మనోహర్ నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మువ్వా విజయ్ బాబు, కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఇటీవల మృతి చెందిన కొండ్రు భద్రయ్య కుటుంబాన్ని మంత్రి పొంగులేటి ఆదివారం పరామర్శించారు. అనంతరం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పత్తి స్వప్న ఇంటికి వెళ్లిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే కనకయ్యలను ఆమె సన్మానించారు. దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీపాషా, దొడ్డ డానియల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.